క్లుప్తంగా

12 మద్యం బాటిళ్లు స్వాధీనం



మద్యం బాటిళ్లతో ఎస్సై నాగరాజు

ముండ్లమూరు (దర్శి): మండలంలోని ఉల్లగల్లులో అక్రమంగా అమ్ముతున్న 12 మద్యం బాటిళ్లను ఎస్సై నాగరాజు గురువారం స్వాధీనం చేసుకున్నారు. మద్యం అమ్ముతున్న సాయి ప్రసన్నకుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఎవరైనా అక్రమంగా మద్యం అమ్మితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

దొనకొండలో పారిశుధ్య పనులు

దొనకొండ: స్థానిక అంగన్‌వాడీ సెంటర్ వద్ద సర్పంచ్ కొంగలేటి గ్రేస్ రత్నకుమారి ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది గురువారం పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా బేతేలుపురం అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ మురుగు నీరు నిల్వ ఉంది. చిల్లచెట్లు మూసుకుపోయి దారి కనపడక పోవటంతో చిన్నారులకు ఇబ్బంది కలగకుండా పారిశుధ్య పనులు చేపట్టారు. చిల్లచెట్లను తొలగించారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ-2 అమీర్

దొనకొండ: మండలంలోని తెల్లబాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల విద్యాధికారి-2 షేక్ అమీర్‌బాషా గురువారం మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఈ సందర్భంగా కుకింగ్ నిర్వాహకులు తయారు చేసిన భోజనాన్ని పరిశీలించి రుచి చూశారు. నిర్వాహకులకు సలహాలు, సూచనలు అందించారు. మెనూ ప్రకారం భోజనం తయారు చేయాలని, ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడి ప్రశ్నలు వేసి జవాబు రాబట్టారు. ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని ఎంఈఓ సూచించారు.

పాస్టర్స్ యూనియన్ అధ్యక్షుడిగా జేమ్స్



మాట్లాడుతున్న పూర్ణకంటి జేమ్స్

పెద్దదోర్నాల: మండల పాస్టర్స్, ఇవాంజలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా పూర్ణకంటి జేమ్స్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. స్థానిక సుందరయ్య కాలనీలో యూనియన్ ఉపాధ్యక్షుడు పాల్ సృజన్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యక్షుడిగా పూర్ణకంటి జేమ్స్‌ను, గౌరవ అధ్యక్షుడిగా యలకపాటి ఇజ్రాయేల్‌ను ఎన్నుకున్నారు. సెక్రటరీగా సింగా ఏసన్న, ట్రెజరర్‌గా యలకపాటి ప్రేమన్నతో పాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ జాయింట్ సెక్రటరీగా యలకపాటి రాజు, రికార్డు రైటర్ దుండి డేవిడ్‌రాజు, సింగా ఏసుదానం, పూర్ణకంటి యకోబు, మందగిరి చంద్రశేఖర్, సువార్తికులు పాల్గొన్నారు.

నేడు ఆయుర్వేద వైద్య శిబిరం

దర్శి: నమస్తే సేవా భారతి ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు బీజేపీ నాయకులు ఏరువ లక్ష్మీనారాయణరెడ్డి ఒక ప్రకటనలో గురువారం తెలిపారు. కోట హనుమంతరావు కల్యాణ మండపంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారన్నారు. సిదద్ధి ఆయుర్వేద వైద్య శిబిరంలో వెన్నెముక, మోకాళ్లు, పాత నొప్పులు, పక్షవాతం వంటి వ్యాధులకు ఆయుర్వేద చికిత్స ద్వారా నయం చేస్తారని చెప్పారు. పూర్తి వివరాలకు 79893 97558, 94981 85401 నంబర్లను సంప్రదించాలని కోరారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన

కొనకనమిట్ల: గ్రామాల్లో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పేర్కొన్నారు. గురువారం చినారికట్ల జంక్షన్ సమీపంలో 132 కేవీ విద్యుత్ ఉప కేంద్రం ఏర్పాటుకు వర్చువల్ పద్ధతిలో సీఎం చంద్రబాబునాయుడు శంఖుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే కందుల తదితరులు హాజరయ్యారు. రూ.33 కోట్లతో నిర్మిస్తున్న సబ్‌స్టేషన్‌తో రైతులకు, గృహ వినియోగదారులకు మేలు చేకూరుతుందని చెప్పారు. కనిగిరి ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి, విద్యుత్ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు, దర్శి ఈఈ శ్రీనివాసరావు, స్థానిక ఏఈ వీరబ్రహ్మం, స్థానిక తహసీల్దార్ సురేష్, దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ, మండల టీడీపీ కన్వీనర్ మోరబోయిన బాబురావు పాల్గొన్నారు.

చేనుకు చెంగావి చీర!

రాచర్ల: ఆరుగాలం కష్టించి సాగు చేసిన పంటలను దిగుబడి చేతికి వచ్చే దశలో అడవి పందులు నాశనం చేస్తున్నాయి. వరి, పత్తి, జొన్న పంట పొలాలను దెబ్బతీస్తున్న అడవి పందులను కట్టడి చేయడం రైతులకు తలకు మించిన భారంగా మారింది. ఈ నేపథ్యంలోనే రైతులు వినూత్న పద్ధతులను అనుసరిస్తున్నారు. పంటలను సంరక్షించుకునేందుకు చీరలను రక్షణ కవచంగా మార్చుకుంటున్నారు. రంగుల చీరలను చూస్తే అడవి పందులు అటువైపు వచ్చేందుకు సాహసించవని రైతులు చెబుతున్నారు.

నిర్లక్ష్యంతో పొంచి ఉన్న ముప్పు

- పురుగుమందుల స్ప్రేలో జాగ్రత్తలు తప్పనిసరి
- పొలాల్లో నిర్లక్ష్యంగా ఉంటే ఆరోగ్యానికి హానికరం

పుల్లలచెరువు:

రైతులు సాగు చేస్తున్న పంటల్లో చీడ పీడల నివారణకు పురుగుమందులు పిచికారీ చేస్తారు. ప్రస్తుతం రసాయనిక పురుగుమందుల వాడకం తప్పనిసరిగా మారింది. ఈ పరిస్థితుల్లో పిచికారీ చేసే వ్యక్తులు తప్పనిసరిగా సరైన జాగ్రత్తలు తీసుకోకుంటే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు చెప్తున్నారు. పంట పొలాల్లో పంటలకు స్ప్రేయింగ్ పనులు చేసే సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకుంటే ఆరోగ్యం వికటించి వైద్యశాలలపాలైన సంఘటనలు మండలంలో అనేకం జరిగాయి. ఆదమరిస్తే ప్రాణ నష్టం కూడా జరిగే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. పంటల్లో పురుగుమందులు స్ప్రే పనులు చేసే సమయంలో రైతులు, కూలీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండల వ్యవసాయఅధికారి నిర్మలాదేవి పలు సూచనలు చేశారు.

- పంటలో పురుగుమందు స్ప్రే చేసే సమయంలో శుభ్రమైన నీటిని వాడటంతో పాటు చేతులకు, కళ్లకు, ముక్కు, నోటికి, చెవులకు తప్పనిసరిగా ప్రత్యేక రక్షణ తీసుకోవాలి.
- పురుగుమందులతో పాటు వచ్చిన కవర్లను వినియోగించకూడదు.
- తలకు టోపితో పాటు ముఖం మొత్తం కప్పేలా చూసుకోవాలి.
- ద్రావణాన్ని కలిపే సమయంలో కచ్చితంగా కళ్లకు కళ్లజోడు పెట్టుకోవాలి. లేని పక్షంలో మందు కలిపే సమయంలో అది కళ్లలో పడకుండా జాగ్రత్త పడాలి.
- మందు ద్రావణాన్ని పంపులో పోసేటప్పుడు స్ప్రేయింగ్ చేసే సమయంలో సిగిరెట్లు, బీడీలు, ఖైనీ వంటివి వేసుకోరాదు.
- మందును ముక్కుతో వాసన చూడకూడదు. మందు స్ప్రేయింగ్ తర్వాత భోజనం చేసే సమయంలో తప్పనిసరిగా చేతులు సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి.
- స్ప్రేయింగ్ చేసే డబ్బా సరైనది ఎంచుకోవాలి. డబ్బా లోపలి నుంచి లీక్ అవ్వకుండా చూసుకోవాలి.
- సరైన నాజిల్ ఎంచుకోవాలి. మందు స్ప్రేయింగ్ సమయంలో నాజిల్లో ఏదైనా అడ్డు పడితే నోటితో ఊదకూడదు.
- గాలి ఎక్కువగా వీచే సమయంలో ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు స్ప్రేయింగ్ పనులు ఆపేయాలి.
- మందు స్ప్రేయింగ్ చేసే సమయంలో గాలికి వ్యతిరేకంగా స్ప్రేయింగ్ చేయకుండా గాలి వాలుకు చేసుకోవాలి.
- మందులు కలిపిన డబ్బాల్లో నీరు పట్టుకొని తాగకూడదు.

పంటలకు చేపట్టిన పురుగు మందులు స్ప్రేయింగ్ పనులు పూర్తయిన తర్వాత డబ్బాలు విచ్చలవిడిగా పడేయకూడదు. డబ్బాలను కడిగి కాలువులు, నీటి కుంటల్లో పోయకూడదు. అవసరానికి అనుగుణంగా మాత్రమే మందులు కలుపుకోవాలి. మిగిలిన మందు డబ్బాలు నివాస ప్రాంతాలకు దూరంగా ఉంచుకునే ఏర్పాటు చేసుకోవాలి. చిన్న పిల్లలకు, పశువులకు దగ్గరగా పురుగుమందు డబ్బాలు ఉండకుండా చూడాలి.



పొలంలో మందు పిచికారీ చేస్తున్న రైతు

నిర్లక్ష్యం వహిస్తే హానికరం:

పంట పొలాల్లో పురుగుమందుల స్ప్రేయింగ్ పనులు చేసే సమయంలో రైతులు, కూలీలు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. నిర్లక్ష్యం చేస్తే ఆరోగ్యానికి హానికరం. పనుల సమయంలో ఆదమరిస్తే ప్రాణాలకే ముప్పు వస్తుంది. కచ్చితంగా జాగ్రత్తలు పాటించాలి.

నిర్మలాదేవి, ఏఓ, పుల్లలచెరువు

చెత్తను తొలగించిన అధికారులు



మెయిన్ బజార్‌లో ఉన్న చెత్తను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది



ముండ్లమూరు పంచాయతీ కార్యాలయం ఎదుట తొలగించిన చెత్త

సాక్షి ఎఫెక్ట్..

ముండ్లమూరు (దర్శి): పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం శీర్షికతో బుధవారం సాక్షి పత్రికలో ప్రచురించిన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. ముండ్లమూరు మెయిన్ బజారు, పంచాయతీ కార్యాలయం, పసుపుగల్లు, ఉల్లగల్లు గ్రామాల్లో ఉన్న చెత్తను తొలగించారు. ఎన్నో నెలలుగా చెత్తను తొలగించకుండా అలాగే పెట్టడంతో దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాలు బారిన పడుతున్నారు. రోడ్లపై చెత్త అసౌకర్యంగా ఉందని, చెత్తను తీసివేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయాలని సాక్షి పత్రికలో ప్రచురించడం జరిగింది. ఆ కథనానికి స్పందించిన అధికారులు చెత్తను పూర్తిగా తొలగించి శుభ్రం చేసి బ్లీచింగ్ కూడా చల్లారు. దీంతో సాక్షి పత్రికకు స్థానికులు ధన్యవాదాలు తెలిపారు.



పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం

బుధవారం సాక్షి పత్రికలో ప్రచురించిన కథనం

రేషన్ డీలర్‌పై ఆగని వేధింపులు



రేషన్‌ను చెక్ చేస్తున్న డీటీ డ్రైవర్ ప్రసన్న

- కమ్మవారిపాలెం రేషన్ దుకాణంలో 24వ సారి తనిఖీ
- అధికారిలా ఓవరాక్షన్ చేస్తున్న డీటీ కారు డ్రైవర్

ముండ్లమూరు (దర్శి): ఐదు నెలల్లో తమ రేషన్ దుకాణాన్ని 24 సార్లు తనిఖీ చేసినట్లు మండలంలోని కమ్మవారిపాలెం రేషన్ డీలర్ గోళ్ల వెంకట రమణ వాపోయారు. బుధవారం రాత్రి 10 గంటల వరకు కమ్మవారిపాలెం రేషన్ షాపు తనిఖీ చేస్తూనే ఉన్నారు. కొండను తవ్వి ఎలుకను కూడా పట్టలేక అధికారులు చేతులు ఎత్తేశారు. ఎక్కడా ఒక్క గింజ కూడా తేడా లేక పోవడంతో లెక్కలు వేసిన లెక్కలే ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు మార్లు వేసిన లెక్కలే వేసి వేసి చివరకు ఉసూరుమంటూ వెనుదిరిగారు. రావిపాడుకు చెందిన డీలర్ నారాయణ అనే టీడీపీ నాయకుడు తన భర్తకు ఫోన్‌లు చేసి రాజీనామా చేయాలని ఒత్తిడి తెస్తున్నాడని ఆమె చెప్పారు. గోడౌన్ డీటీకి ఫోన్‌లు చేసి వారి డీడీలు కట్టించుకోవద్దని ఒత్తిడి చేశారని వాపోయారు. వారికి కందిపప్పు, చెక్కర ఇవ్వవద్దని ఒత్తిళ్లు తీసుకొచ్చారన్నారు. ఉదయం 9 గంటలకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ లక్ష్మీప్రసన్నతో పాటు ఆర్ఐ, వీఆర్ఓ, వీఆర్ఏ, కానిస్టేబుల్‌తో సహా 20 మంది అధికారులు షాపు వద్దకు వచ్చి రాత్రి 10 గంటల వరకు తమ షాపును తనిఖీ చేశారని విచారం వ్యక్తం చేశారు. బుధవారం రాత్రి జరిగిన తనిఖీతో తన షాపులో 24వ సారి తనిఖీ చేశారని డీలర్ చెప్పారు. ఒక్క షాపు తనిఖీ చేయాలంటే అరగంట పడుతుంది. అయితే ఎంత ఒత్తిడి ఉంటే అధికారులు రాత్రి 10 గంటల వరకు తనిఖీల పేరుతో డీలర్లను ఇబ్బంది పెడుతున్నారో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.



24వ సారి తనిఖీ చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ లక్ష్మీప్రసన్న

ఓవరాక్షన్ చేస్తున్న డ్రైవర్ ప్రసన్న

ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ లక్ష్మీప్రసన్న కారు డ్రైవర్ ప్రసన్న చేస్తున్న ఓవరాక్షన్ చూసి స్థానికులు సైతం ముక్కున వేలేసుకుంటున్నారు. అసలు డీటీ డ్రైవరా లేక వారందరిపై అధికారా అనుమానాలు వచ్చే విధంగా అతని ప్రవర్తన ఉంది. పచ్చ చొక్కా వేసుకుని డీటీ చెప్పకుండానే తానే డీటీ అన్నట్లు రేషన్ షాపుల్లో హల్‌చల్ చేస్తున్నాడు. రేషన్ బండిని ఆయనే తనిఖీ చేయడం.. షాపులోకి వెళ్లి బస్తాలు లెక్కేయడం, అన్నీ ఫైళ్లు తిరగేసి చూడటం చూసి స్థానికులు పెద్ద ఆఫీసరై ఉంటాడనుకున్నారు. ఆయన హల్‌చల్ చేయడం చూసి ఈయన ఏ స్థాయి అధికారో అని తెలుసుకునేందుకు స్థానికులు ప్రశ్నించారు. దీంతో వారు డీటీ కారు డ్రైవర్ అని చెప్పడంతో ముక్కున వేలేసుకున్నారు.

పంపిణీకి సిద్ధంగా గడ్డి కోత యంత్రాలు

పొదిలి రూరల్: పశువులకు అవసరమైన గ్రాసాన్ని ముక్కలుగా చేసి అందించే యంత్రాలు అందుబాటులో ఉన్నాయని ఉన్నగురువాయుపాలెం పశు వైద్యాధికారి మంచికల మణిశేఖర్ తెలిపారు. కృపా ఇండ్రీస్ట్రీస్‌కు చెందిన పవర్ ఆపరేటెడ్ శాఫ్ కట్టర్ 2 హెచ్‌పీ యంత్రం రూ.33,970 కాగా 40 శాతం సబ్సిడీ పోను రైతులు రూ.20,382 చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. యంత్రాలు అవసరమైన వారు పశు వైద్యాధికారిని సంప్రదించాలని సూచించారు.

క్యాన్సర్‌పై అవగాహన

కొనకనమిట్ల: గొట్లగట్టు ప్రభుత్వ వైద్యశాల ఆధ్వర్యంలో గురువారం పలు గ్రామాల్లో క్యాన్సర్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్యాధికారి పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది చినారికట్ల, పాతపాడు, సిద్ధవరం, చినమనగుండం, నాగంపల్లి గ్రామాల్లో సర్వే చేపట్టి క్యాన్సర్ లక్షణాల గురించి వివరించారు. అనుమానితులు ప్రభుత్వ వైద్యశాలలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ నారాయణరెడ్డి, ఎంపీహెచ్ఎస్ జె.వెంకటేశ్వర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

హైస్కూళ్లలో పరీక్షల తనిఖీ

బేస్తవారిపేట: స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్లో సెల్ఫ్ అసెస్మెంట్-2 పరీక్షలను మార్కాపురం డీవైఈఓ శామ్యూల్ గురువారం తనిఖీ చేశారు. రెగ్యులర్‌గా పాఠశాలకు హాజరుకావాలని, పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. హిందీలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓలు కాశయ్య, సీహెచ్ రమణారెడ్డి, హెచ్ఎం కర్నాటి తిరుపతిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేకనకొండలో కుక్కల స్వైరవిహారం



ఓ వీధిలో ఘర్షణ పడుతున్న వీధికుక్కలు

కురిచేడు: మండలంలోని దేకనకొండలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. గ్రామంలో ఒంటరిగా కనిపించిన చిన్నారులపై దాడులు చేసి గాయపరుస్తున్నాయి. వాటిని పట్టించుకోక పోవడంతో రెచ్చిపోయి ప్రవర్తిస్తున్నాయి. ఓ వీధి కుక్కలు మరో వీధికి వెళ్తే పోట్లాడుకుంటున్నాయి. పంచాయతీ అధికారులు స్పందించి గ్రామంలోని కుక్కలను పట్టించి ఎక్కడికైనా తరలించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇటీవల మండల కేంద్రం కురిచేడులో ఇదే పరిస్థితి కొనసాగితే పంచాయతీ అధికారులు వాటిని పట్టించి వేరేచోటకు పంపించారు. అదే విధంగా దేకనకొండలో కూడా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ముందస్తు పరీక్షలతో క్యాన్సర్ నుంచి రక్షణ

దొనకొండ: అందరికీ క్యాన్సర్ పరీక్షలు-క్యాన్సర్‌పై విజయం, ముందస్తు పరీక్ష-కాన్సర్ నుంచి రక్ష అనే కార్యక్రమం వైద్యాధికారులు ఎం.సునీత, కె.సునీత ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది గురువారం నిర్వహించారు. స్థానిక రైల్వే స్టేషన్ ఆవరణలో వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటి వద్దే 18 ఏళ్లు దాటిన ప్రతి పౌరునికి ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. గ్రామంలోని ఏఎన్ఎంలు, ఎంఎల్‌పీహెచ్‌లు, ఆశాలు స్క్రీనింగ్‌లు చేస్తారని చెప్పారు. ముందుగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



దొనకొండలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

తెల్లబాడులో..

మండలంలోని తెల్లబాడు గ్రామంలో నిర్వహించిన కాన్సర్ వైద్య పరీక్షల్లో వైద్యాధికారి ఎం.సునీత పాల్గొని పలు సూచనలు, సలహాలు అందజేశారు.

పంటల్లో తెగుళ్లపై అవగాహన ఉండాలి

దర్శి: డీలర్లకు పంటల్లో వచ్చే తెగుళ్లపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ జి.రమేష్ అన్నారు. స్థానిక కేవీకేలో దేశీ సర్టిఫికెట్ (5 వారాల) కోర్సు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ మాట్లాడుతూ కనీస అవగాహన ఉంటేనే రైతులకు సరైన పిచికారీ మందులు, రాసాయనిక ఎరువులు ఇవ్వగలరని చెప్పారు. అవగాహన లేకుండా మందులు అమ్మితే రైతులు ఎక్కువగా నష్టపోయే ఆస్కారం ఉందన్నారు. సర్టిఫికెట్‌లను చక్కగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ వరప్రసాద్‌రావు మాట్లాడుతూ ఏయే పంటల్లో ఎలాంటి కీటకాలు ఆశిస్తాయి.. పంటలకు ఎలాంటి తెగుళ్లు వ్యాప్తి చేస్తాయి.. వాటిని ఎలాంటి సస్యరక్షణ పద్ధతులను ఉపయోగించి తగ్గించవచ్చో తెలిపారు. సస్యరక్షణ పద్ధతుల ద్వారా తగ్గనప్పుడు మాత్రమే రైతులకు సరైన పిచికారీ మందులు రసాయనిక ఎరువులు అమ్మాలన్నారు. కార్యక్రమంలో దర్శి ఏడీఏ బాలాజీ నాయక్, గృహ విజ్ఞాన శాస్త్రవేత్త టి.మానస పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ రమేష్

సాయిబాబా మందిరంలో పూజలు

పెద్దారవీడు: మండలంలోని చట్లమిట్లలో షిరిడీ సాయిబాబా మందిరంలో భక్తులు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు సాయిబాబాకు పట్టు వస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించి, అభిషేకాలు, ప్రత్యేక హారతులిచ్చారు. పలు గ్రామాల నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు మధ్యాహ్నం భక్తుల కోసం అన్నదానం ఏర్పాటు చేశారు.



ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

ప్రత్యామ్నాయ పంటగా ఉలవ సాగు



ఉలవ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ ప్రసాద్‌రావు

తాళ్లూరు: ప్రత్యామ్నాయ పంటగా ఉలవ సాగు చేపట్టాలని ఏఓ బి. ప్రసాద్‌రావు అన్నారు. మండలంలోని కొత్తపాలెం, రజానగరం, తాళ్లూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ప్రసాద్‌రావు మాట్లాడుతూ పొగాకు ప్రత్యామ్నాయంగా ఉలవలు సాగు చేస్తే వంద రోజుల సాగును పరిగణనలోకి తీసుకుని తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందొచ్చన్నారు. క్వింటాకు రూ.10 వేలు ధర పలుకుతోందని చెప్పారు. ఉలవలు మంచి ఆరోగ్యాన్ని ఇస్తాయని రైతులకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని చెప్పారు. కార్యక్రమంలో వీఏఏ నాగరాజునాయక్, కె.అశోక్, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై ఏపీడీ విచారణ

అర్ధవీడు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించాలని చూస్తోందని, అందులో భాగంగా ఏపీఓ కె.శ్రీనివాసరెడ్డి తమను వేధిస్తున్నారని పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లు గురువారం ఏపీడీ భాస్కర్‌రావు దృష్టికి తీసుకొచ్చారు. తమకు నాలుగు నెలలుగా వేతనం ఇవ్వకుండా రాజీనామా చేయాలని బలవంతం చేస్తున్నారంటూ ఫీల్డ్ అసిస్టెంట్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో గురువారం ఏపీడీ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్లు తమ సమస్యలను వివరించారు. గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లతో సంబంధం లేకుండా టీఎలు, ఏపీఓ, కంప్యూటర్ ఆపరేటర్ బయట వ్యక్తులతో మస్టర్ వేయిస్తూ బిల్లులు చెల్లిస్తున్నారని తెలిపారు. రాజీనామా చేయాలంటూ ఏపీఓ చెప్పిన వాయిస్ రికార్డులను సైతం విచారణాధికారికి వినింపిచారు. ఏపీఓ, కంప్యూటర్ ఆపరేటర్ నాగరాజు తప్పుడు బిల్లులు పెట్టి దోచుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు ఏపీడీ చెప్పారు.



విచారణ నిర్వహిస్తున్న ఏపీడీ

ఘనంగా సీవీ రామన్ జయంతి

మార్కాపురం: మార్కాపురంలోని డాక్టర్ సామ్యేల్ జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో సర్ సీవీ రామన్ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు మాట్లాడుతూ.. భౌతిక శాస్త్రంలో తొలి నోబెల్ పురస్కారం అందుకున్న సీవీ రామన్ జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకుని సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు చేయాలని సూచించారు. మాజీ మంత్రి కళాశాల టెక్నికల్ అడ్వయిజర్ డాక్టర్ ఆదిమూలపు సురేష్, కార్యదర్శి ఆదిమూలపు విశాల్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ మస్తానయ్య, పలువురు ప్రొఫెసర్లు పాల్గొన్నారు.